# స్వరాష్ట్రంలోనే గ్రామాల అభివృద్ధి



బరంగేడ్గి ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

- సీఎం కేసీఆర్ సహకారంతోనే పుష్కలంగా నిధులు మంజూరు
- మన రాష్ట్రంలోనే సంక్షేమ పథకాల అమలు
- ఓట్ల కోసం అబద్ధాలు ఆడేవారిని నమ్మొద్దు
- సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి
- నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- కామారెడ్డిలో బంజారా భవన్ నిర్మాణ పనులకు భూమిపూజ

నస్రుల్లాబాద్/ కామారెడ్డి/బాన్సువాడ, అక్టోబర్ 8: స్వరాష్ట్రంలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో గ్రామాలకు పెద్దమొత్తంలో నిధులు వస్తున్నాయని తెలిపారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంతోపాటు నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో పర్యటించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో రూ.28 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రహదారి పక్కన బంజారా భవన్ నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో స్పీకర్ మాట్లాడుతూ.. సమైక్యపాలనలో గ్రామాల అభివృద్ధి కోసం అరకొర నిధులు వచ్చేవని, నేడు ఒక్కో గ్రామానికి ఏడాదికి కోట్ల రూపాయలు వస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వచ్చాకే రైతుబంధు, మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్లు తదితర సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు ఈ పథకాలు లేవన్నారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానల్లోనే అత్యధికంగా సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు. బాన్సువాడ ప్రాంత రైతాంగం దేశానికి అన్నంపెట్టే స్థాయికి ఎదగాలన్నారు. నియోజకవర్గంలో ప్రజలు, రైతాంగానికి మంచి చేసే నాయకుడిని కాపాడుకోవాలన్నారు. కొన్ని పార్టీల నాయకులు ఓట్ల కోసం అబద్ధాలు ఆడుతున్నారని అన్నారు. ఆ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ సంక్షేమ పథకాలను ఎందుకు అమలుచేయడంలేదని ప్రశ్నించారు. ప్రజలకు అంతా తెలుసని, వారి మాయమాటలు నమ్మరని అన్నారు.

**బంజారాలు ఉన్నత స్థాయికి ఎదగాలి**

జిల్లా కేంద్రంలోని బైపాస్ రహదారి పక్కన బంజారా భవన్, మూడు మందిరాల నిర్మాణం కోసం ప్రభుత్వం ఎకరం భూమిని కేటాయించిందని స్పీకర్ తెలిపారు. వీటి నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం త్వరలోనే సీఎం కేసీఆర్‌ను కలుస్తానని చెప్పారు. బంజారాలు చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. గిరిజన బాల, బాలికల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలో పోడు భూముల సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే 5,013 మంది బంజారాలకు 11,365 ఎకరాలకు సంబంధించిన ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఈ భూములకు రైతుబంధు, రైతుబీమా వర్తిస్తుందని చెప్పారు. మిగిలిన వారికి కూడా త్వరలో ఇప్పిస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని తండాల్లో జగదాంబ, సేవాలాల్ మహారాజ్ మందిరాల నిర్మాణానికి రూ. 20 కోట్లు మంజూరుచేసినట్ల తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గానికి 11వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరైతే అందులో 2,570 ఇండ్లను బంజారాలకు కేటాయించినట్లు చెప్పారు. ప్రజలను కొంత మంది తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. మంచేదో, చెడేదో తెలుసుకొని, మంచి మనసుతో తమను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం బంజారా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పౌరాదేవి పీఠాధిపతి రామారావు మహరాజ్ మనవడు బాబూసింగ్ మహరాజ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, బంజారా నాయకుడు బద్యానాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గణేశ్ నాయక్, మోతీ సింగ్ నాయక్, ప్రవీణ్ నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి



గురడి రెడ్డి సంఘ ప్రతినిధులకు ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి

- అన్ని వర్గాలకూ ప్రాధాన్యం
- ఇంటింటికీ సంక్షేమ ఫలాలు
- బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మొద్దు
- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- జక్రాన్‌పల్లిలో కుల సంఘాల ప్రతినిధులకు ప్రొసీడింగ్ కాపీల అందజేత

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 8 : ప్రజలు పనిచేసే ప్రభుత్వాలను ఆదరించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతున్నాయని అన్నారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్నదని తెలిపారు. మండలంలోని మునిపల్లి, లక్ష్మాపూర్, నారాయణపేట్ గ్రామాల్లో ఎస్సీ, బీసీ, మైనార్టీ సంఘాల సభ్యులకు రూ.కోటీ 45 లక్షల విలువ గల ప్రొసీడింగ్ కాపీలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ సహకారంతో రూరల్ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలకు రూ.16 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అఖండ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరే అని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి కాంగ్రెస్, బీజేపీ నుంచి నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. నియోజకవర్గ ప్రజలే తన కుటుంబ సభ్యులుగా భావించి, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీల నాయకులు వచ్చి మాయమాటలు చెబుతారని, కానీ మనకు అందుబాటులో ఉన్నది ఎవరు?.. కష్టసుఖాల్లో పాలుపంచుకున్నది ఎవరు.. అభివృద్ధి చేసిందెవరనేది ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల, జడ్పీటీసీ తనూజ, వైస్ ఎంపీపీ ముస్కు తిరుపతిరెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, మండల కో–ఆప్షన్ మెంబర్ అక్బర్‌ఖాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, రైతుబంధు సమితి మండల కన్వీనర్ ఢీకొండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మైదం రాజన్న, అనంత్‌రెడ్డి, పార్టీ మునిపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు రాజారెడ్డి, భాస్కర్, నారాయణపేట సర్పంచ్ రబ్బా వెంకట్, లక్ష్మాపూర్ సర్పంచ్ కైలాస్, ఎంపీటీసీ గుడాల అను, బీఆర్ఎస్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న పల్లెలు
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- బీబీపేట్ మండలంలో పర్యటన
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



తుజాల్‌పూర్‌లో పల్లె దవాఖానను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

బీబీపేట్/రామారెడ్డి, అక్టోబర్ 8: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బీబీపేట్ మండలంలోని పలు గ్రామాల్లో రూ.48 కోట్ల 61 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. మండలకేంద్రంతో పాటు తుజాల్‌పూర్, శేరీ బీబీపేట, మల్కాపూర్, ఉప్పర్‌పల్లి, యాడారం, శివారు రాంరెడ్డిపల్లి, జనగామ, మాందాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్లు, పల్లె దవాఖానలు, కమ్యూనిటీ హాలును ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రామారెడ్డి మండలంలోని జగదాంబ తండా, పట్టుతండా, స్కూల్ తండా గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాడ్డాక గ్రామాలకు మహర్దశ వచ్చిందని అన్నారు. మండలాలూ అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని, రెండు వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టాలని కోరుతూ విద్యార్థులు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్‌నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగు రవీందర్ గౌడ్, జనరల్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు రాజు, లలిత, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి పట్టం కట్టండి

- నా పనితీరు చూసి ఓటేయండి
- అన్ని రంగాల్లో ఆర్మూర్‌ను అభివృద్ధి చేశా..
- మన పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్నాయా ?
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



తల్వేద ఎత్తిపోతల పునర్జీవ పథకం పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్, అక్టోబర్ 8 : ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. 'నమస్తే నవనాథపురం'లో భాగంగా ఆదివారం డొంకేశ్వర్ మండలంలోని గాదేపల్లి , జీజీ నడ్కుడ, చిన్నయానం గ్రామాల్లో 'ప్రజాశీర్వాద యాత్ర' నిర్వహించారు. గాదేపల్లిలో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ పదేండ్ల కాలంలో గ్రామాల్లో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గాదేపల్లిలో 151 మందికి ఇప్పటివరకు ఆసరా పెన్షన్ల రూపంలో రూ.4.05 కోట్లు, జీజీ నడ్కుడలో 447 మందికి రూ.10.14 కోట్లు, చిన్నయానంలో 65 మందికి రూ.1.20 కోట్ల పెన్షన్లు అందించినట్లు చెప్పారు. గాదేపల్లి, నందిపేట్, తొండాకూర్‌లో ఆలయాలు, కమ్యూనిటీ భవనాలు, అదనపు గదులు, దళితవాడ సంఘాలకు నిధులు మంజూరు చేశామన్నారు. జీవితాంతం సేవ చేసే అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కేసీఆర్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు లేవని ప్రశ్నించారు. మానవీయ కోణంలో కేసీఆర్ పాలన సాగుతున్నదని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌లు తెలంగాణపై కక్షగట్టాయన్నారు. ఈ రెండు పార్టీలకు ఓటేస్తే తెలంగాణకు మళ్లీ శని పడుతుందన్నారు. బీఆర్ఎస్‌ను మళ్లీ ఆశీర్వదించాలని, కేసీఆర్ నాయకత్వానికి అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**తల్వేద ఎత్తిపోతల పునర్జీవ పథకానికి భూమిపూజ**

నందిపేట మండలంలోని తల్వేద ఎత్తిపోతల పునర్జీవ పథకానికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ పునర్జీవ పథకానికి ప్రభుత్వం రూ. కోటీ 65 లక్షలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చింరాజ్‌పల్లి, తల్వేద గ్రామాల్లో నిర్మించిన ఫంక్షన్ హాళ్లను జీవన్‌రెడ్డి ప్రారంభించారు.